# పనిలేని మనిషి

-సిహెచ్. వి. బృందావనరావు

"**వు**న్నావుటోయ్, మూర్తీ" అంటూ లోపలికి వచ్చాడు పరమేశ్వర్రావు.

నాకు తెలుసు. సెలవురోజయితే చాలు, ఈ టైముకు పరమేశ్వర్రావు మా ఇంటికి వస్తాడని. పనా, పాడా. దేశంమీద బలాదూరు తిరగడమే గదా ఈ పెద్ద మనిషి చేసే పని. "రండ్రండి" అంటూ సోఫా చూపించాను.

"రండి బాబాయ్, రండి. మంచినీళ్ళిమ్మంటారా" అంటూ లోపల్నించి బిరబిరా వచ్చింది మా ఇంటి ఇల్లాలు. నాకైతే అర్థంగాదు గాని, మా ఆవిడకు ఆయ నంటే దిక్కుమాలిన అభిమానం. ఆయన వచ్చాడంటే చాలు, కాఫీలూ, టిఫిన్లూ- అబ్బో.

## బెడద

**వి**ద్యార్థులకు క్యాపిటేషన్ ఫీజుల బెడద
రాజకీయాల్లో అసమ్మతీయుల బెడద
రైతన్నలకు కల్తీ విత్తనాలు, మందుల బెడద
ఇల్లాలికి మండే గ్యాస్, ఉల్లి ధరల బెడద
ప్రజలకు అనారోగ్యం బెడద
దూరవాణిలో చెత్త సీరియల్స్ బెడద

## రాద్ధాంతం - సిద్ధాంతం

**ఆ**డ, మగ క్రింద బడితే రాద్ధాంతం
అదే క్రింద మీద పడితే సిద్ధాంతం
ఇద్దరు ఒక్కటైతే సుఖాంతం
రససిద్ధి జరిగితే ఫలవంతం

## కవిత్వం

**క**డుపు మండితే కవిత్వం
వలపు పండితే కవిత్వం
గుండె నిండితే కవిత్వం
మనస్సు వికటిస్తే కవిత్వం
మమత బాధిస్తే కవిత్వం
ప్రేమ చిగురిస్తే కవిత్వం
కవిత్వం ఓ తీరని దాహం
కవి దానికి దాసోహం

-కొంపల్లి వీరభద్రరావు

సెలవు రోజుయినందున టీ.వీ చూస్తూ, షేర్ల పరిస్థితి ఏందో, దేని ప్రభ ఎట్లా వెలుగుతున్నదో చూస్తూ, నా షేర్లు ఏమైనా నాలుగు రాళ్ళు సంపా యించిపెడతాయా, లేదా అని- ఆ సంగతి టీ.వీలో ఏకాగ్రతతో చూస్తున్నాను. ఇంతలో ఈ పెద్ద మనిషి.

"బాబాయ్, మంచినీళ్ళు" అని గ్లాస్ అందించింది మా ఆవిడ. అప్పటిదాకా గాలి విసురుకుంటున్న పేపర్ను టీపాయిమీద పడేసి మంచినీళ్ళ గ్లాసు అందు కున్నాడు పరమేశ్వర్రావు. మా ఆవిడ ఫాన్ స్విచ్ ఆన్ చేసి వచ్చింది.

"పిన్ని ఎలా ఉంది బాబాయ్" అని అడిగింది కల్యాణి.

"ఏదో నడిచిపోతున్నది. కొత్త సమస్యలేమీ లేవు కాని పాతవి చాలుగా దాని ప్రాణానికి. షుగరు మామూలే. మోకాళ్ళ నెప్పులూ మామూలే. ఏదో బండి నెట్టుకొస్తున్నాం" అన్నాడు పరమేశ్వర్రావు.

పరమేశ్వర్రావు ఉద్యోగం నుంచి రిటైరై ఆరేడు నెలలు అయింది. ఆ దంపతులకు ఇద్దరు కొడుకులూ ఓ కూతురూ. అందరికీ పెండ్లిండ్లయినాయి. ఎవరి బతుకులు వాళ్ళు బతుకుతున్నారు వేరే వేరే ఊళ్ళల్లో. కొడుకులు ఏవో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఈ ముసలాండ్లిద్దరూ ఈ ఊళ్ళోనే కాలక్షేపం చేస్తున్నారు. ఓ చిన్న సొంతిల్లు ఉంది. పరమేశ్వర్రావుకు వచ్చే పెన్షను వారిద్దరికీ ఏ లోటూ లేకుండా సరిపోతుంది.

"రిటైరైనారు కదా బాబాయ్, కొడుకుల దగ్గరికి పోయి వుండొచ్చుగదా" అంది మా కల్యాణి.

"పిల్లలిద్దరూ రమ్మంటూనే వున్నారు. కోడళ్ళు కూడా మా ఇద్దర్నీ వాండ్ల దగ్గరికి వచ్చేయమంటూనే వున్నారు. కానీ మాకింకా కొంచెం ఒంట్లో ఓపికలున్నాయి గదా. మా పనులు మేం చేసుకోగలుగుతూనే వున్నాం. ఇప్పుడే పోయి వాండ్లనెత్తిన ఎందుకు పడాలి" అన్నాడు పరమేశ్వర్రావు.

"అదేందండీ అట్లా అంటారు. నెత్తినపడేదేముంది. మీ పిల్లలిద్దరూ ఉత్తములు. మీరు అవస్థలుపడుతున్నారే అని అనుకునేవారే గాని, మీరు భారం అనుకునేవారు కాదు గదా" అన్నాను.

"నిజమేనయ్యా. కానీ ఉద్యోగంలోంచి రిటైరు

కాగానే అన్ని వ్యాపకాలూ కట్టిపెట్టి జీవితం చివరి దశకు వచ్చేశామని నిశ్చయం చేసుకొని అకర్మణ్యంగా పడుకొని వుండటమేనా? ఇదుగో చూడు మూర్తీ, మగాడన్న తర్వాత, అసలు మగాడనే ఏమిటి, మనిషన్న తర్వాత,శరీరం సహకరించినంతకాలం ఏదో ఒక పని చేస్తూనే వుండాలయ్యా. అసలు ఇతరులమీద ఆధార పడాలనే ఊహ కూడా రానీయగూడదయ్యా. తండ్రయినా సరే, కొడుకులయినా సరే'' అన్నాడు.

ఇదుగో, అన్నీ ఇలాంటి లోకవిరుద్ధపు అభిప్రాయాలే ఇతనికి. ఉద్యోగంలోంచి రిటైరయినాడు గదా. ఇంక ఇక్కడెందుకు. పిల్లల్దగ్గరవుంటూ కృష్ణా, రామా అనుకోవచ్చు గదా. ఇక్కడేమైనా వ్యాపారాలేమైనా చేస్తు న్నాడా అంటే ఏమీ లేదాయే. పెన్షను వస్తుంది. ఇంటద్దె లేదు. భార్యాభర్తలిద్దరికీ సరిపోగా, ఐదొందలో, ఆరొందలో మిగుల్తుంది గూడా. “సరేనండీ. మీరిక్కడేమైనా చేస్తున్నారా, అది ఆగిపోతుందనుకోడానికి” అని అడిగాను. ఆయన తరచూ ఇంటికి వచ్చి చనువుగా వుంటాడు గదా అని నాకూ ఆయనంటే కొంచెం చనువే. అందుకే నేనూ స్వతంత్రంగానే మాట్లాడుతాను.

“కాఫీ తాగండి బాబాయ్” అని కాఫీ గ్లాసుతో వచ్చింది మా ఆవిడ. చెప్పానుగా. ఈ బాబాయంటే మహా అభిమానం మా కల్యాణికి. నా దృష్టిలో మాత్రం ఆయన ఏమీ పనిలేని వాడు. దమ్మిడీ సంపాదించుకోవడమో, దాచుకోవడమో తెలియనివాడు. ఒకవేళ ఏ పనైనా చేసినా అన్నీ ఉపయోగం మాలిన పనులే.

“మీకు నెలకు ఓ వెయ్యి అయినా మిగులుతుంది గదా. కనీసం ఇన్‌స్టాల్‌మెంటుల్లోనైనా ఓ ఇంటిసైటుకొని అక్కడ పారెయ్యొచ్చు గదా” అన్నాను.

‘‘నాకెందుకోయ్ ఇప్పుడు ఇంటి జాగా. ఇల్లుంది గదా” అన్నాడు.

“ఇరవైనాలుగ్గంటలూ ఏదో పనిమీద తిరుగుతూనే వుంటారు గదా, సొసైటీ ఎలా వుందో తెలీదా మీకు. స్థలమంటే డబ్బండీ, డబ్బు. ఇవ్వాళో గజం చోటుకొని, ఇక దాని సంగతి మరిచిపోండి. ఏడాది తిరిగేసరికి, మీరు పెట్టిందానికి, మూడింతలు రాకపోతే నన్నడగండి” అన్నాను.

“ఇప్పుడు నాకెందుకయ్యా డబ్బు” అన్నాడాయన. డబ్బెందుకయ్యా అనే వాడితో ఇంక నేను మాట్లాడేదే ముంటుంది.

“మంచి రేటు వచ్చినపుడు అమ్మి, ఆ వచ్చిన డబ్బు మీ పిల్లలకివ్వచ్చు గదా” అన్నాను.

“మా పిల్లలకు ఇంకా ఏమివ్వాలి నేను. ఇచ్చింది చాలదా” అన్నాడు. చెప్పొద్దూ... నాకు కోపం వచ్చింది.

“ఏమిచ్చారండీ మీ పిల్లలకు మీరు. ఓ సెంటు భూమి ఇచ్చారా.ఓ గజం ఇండ్ల జాగా ఇచ్చారా. పోనీ మీరు సంపాదించిన ఆస్తి ఏమైనా ఇచ్చారా” అన్నాను ఉండబట్టలేక, చనువుగానే.

“అవ్వన్నీ ఎందుకివ్వాలండీ వాండ్లకు. మా నాన్న నాకేమీ ఇవ్వలేదు నేను వాండ్లకు ట్రాన్స్‌ఫర్ చెయ్యడానికి. అయినా ముగ్గురు పిల్లలకూ మంచి విద్య చెప్పించాను. ముగ్గురూ పోస్టుగ్రాడ్యుయేట్లయ్యేట్టు చూశాను. ఆ చదువుతో వాండ్లు మంచి ఉద్యోగాలే సంపాదించు

## చమురు దీపం

**నా**కు ఊహ కలిగే నాటికే నా తండ్రి జీవితం
కరిగి పోతున్న హారతి కర్పూరం
ఆయనకు ఏడుగురు కనుపాపలు
చీకటినీ వెలుగునీ వాటిలోంచే చూశాడు
మా సుఖాల కోసం అటు సూర్యోదయాన్నీ
ఇటు సూర్యాస్తమయాన్నీ కావడి కుండలుగానే
మోశాడు
కన్నీటిని ఆయన తాగి
తన ప్రేమతో దాన్ని అమృతంగా మార్చి మాకు
తాగించేవాడు
ఈనాటి మా సుఖాలన్నీ
ఒకనాటి ఆయన కాయకష్టం నుండి ఒలికించిన
ఫలరసాలే
ఈనాడు మా కళ్ళముందు కదిలే గుప్పెడు రూపాయలు
ఒకనాటి ఆయన శ్రమ మొక్కకు పూచిన పూలే
మా పిల్ల పాపల చదువుల పంటలు
ఆయన కృషి సాధించిన ఫలసాయమే
మా యింటి ఆడపిల్లల పెళ్ళిళ్ళు
ఆయన అదృశ్యహస్త ఆశీస్సుల వెలుగులే
ఈనాడు మేం తినే తిండి కట్టే బట్ట పీల్చే గాలి
ఆనాడు ఆయన చేతి చలువ మీదుగా ఎదిగిన
వ్యాపార వృక్ష ఫలాలే!
ఒకనాటి ఆయన స్వేదం, రక్తం
ఈనాడు మా జీవితాన్ని వెలిగిస్తున్న చమురు దీపం

**-వి. సూర్యారావు**

## అనురాగ హేల

చిరుగాలుల సవ్వడి విని
నీ తీయని పిలుపనుకొని
రాలిన పూరేకుల కదలికలను
నీవు వచ్చావనుకొని భ్రమించి
ఆనందంతో నా మనసు తుళ్ళిపడి
సంబరాల అంబరాల్ని దాటి
దిగంతాల ఆవలకు తేలిపోతుంటే
నా భ్రమను నిజంచేస్తూ
మిరుమిట్లు గొల్పుతూ నా కళ్ళ ముందు నీవు
చిరునవ్వులతో ప్రత్యక్షమై
నీ చేయి అందించి
మధుర స్పర్శను కలిగించి
నన్ను పరవశింపచేసి
వలపు జల్లులు కురిపించగా
ఏమని కవితలల్లను నా ప్రాణమా
నా హృదయ స్పందనను!
ఎలా చెప్పుకోను
నా మదిలోని తీయని అనుభూతిని!
ఎలా వర్ణించను
ఈ అనురాగ హేలను!

## మత్తుగా...

నీవు నవ్విన చోట మల్లెల జడివాన
వడివడిగా కురుస్తుంది
నీ తలపులు గుర్తుకు వస్తే
మండుటెండలో మలయ మారుతం
అలవోకగా వీచినట్లనిపిస్తుంది
మిసమిసలాడే నీ అందం చూసి
చందమామే తెల్లబోతాడు
నీ కాటుక కళ్ళల్లో
సంధ్యా సుందరి నాట్యం చేస్తోంది
నీ శిరోజాలను ముద్దాడుతున్న
గులాబీ గర్వంతో విర్రవీగుతోంది
నీ సౌందర్యాన్ని కళ్ళతో తాగి
నా కళ్ళు మత్తుగా ఎర్రబడుతున్నై

-గోపాలుని వెంకటేశ్వర్లు

కున్నారు. మంచి సంబంధాలు చూసి పెండ్లిండ్లు చేశాను. వాండ్ల బతుకులు వాండ్లు సుఖంగా బతుకు తున్నారు. తండ్రిగా వాండ్లకు విద్య ఇచ్చి, వివేకం ఇచ్చి, వివేచన ఇచ్చి...వాండ్ల కాళ్ళమీదవాళ్ళు నిలబడేట్టు చేశాను. ఇంకేం చెయ్యాలి" అన్నాడు.

"ఆ మాత్రం పనులు అందరు తండ్రులూ చేసేవే గదా" అన్నాను.

"ఇదుగో మూర్తీ. అసలు నా ఉద్దేశ్యంలో ఏ తండ్రీ తన పిల్లలకు ఆస్తులివ్వగూడదయ్యా. విద్యాబుద్ధులు చెప్పించి, మంచి జీవిత భాగస్వామిని ఎంచుకోవడంలో సహకరించి, నీతిగా బతికే దోవ చూపిస్తే చాలు. పెద్దలు ఇచ్చింది అనుభవించడం కాక, తాము స్వయంగా సంపాదించుకోవడంలో వుండే తృప్తి పిల్లలకు అనుభవం గావాలి" అన్నాడు.

అన్నీ ఇలాంటి వితండ వాదాలే ఈయన చేసేది.

"కనీసం పెండ్లిండ్లు చేసేటప్పుడైనా కొంచెం కట్నం వచ్చే సంబంధాలు చూసి వుండొచ్చుగదా. మీ పిల్లలు మంచి ఉద్యోగాలు చేస్తూనే వున్నారు. లక్షల్లో ముట్టేవి గదా కట్నాలు. మీరు ఇవ్వకాపోతిరి. వచ్చే దారినీ మూసేయిస్తిరి" అన్నాను, బహుశా ఆయనకు కోపం వస్తుందేమో అనుకుంటూనే.

అయితే ఆయన కోప గించు కోలేదు. నవ్వుతూనే మాట్లాడాడు.

"చూడు మూర్తీ. కట్నం తీసుకున్న మగవాడు నా దృష్టిలో మనిషే కాదు. పశువుకన్నా నీచుడు. మా పిల్లలు కట్నం వద్దంటే, వద్దన్నారు గాని, వాండ్లు కట్నం తీసుకొని వుంటే, మళ్ళీ వాండ్ల మొహంగూడా చూసే వాడిని కాదు" అన్నాడు. ఇక ఈ పిచ్చి మనిషితో ఏం మాట్లాడమంటారు.

"బాబాయ్...ఒక్క అట్టు" అంటూ ప్లేట్లో రెండు పెస రట్లు వేసుకు వచ్చింది మా కల్యాణి.

"వద్దమ్మా, ఇప్పుడు తిన లేను- ఇప్పుడు టిఫిన్ తింటే ఇంక అన్నం తిన్లేను" అన్నాడు పరమేశ్వర్రావు.

"ఒక్కటంటే ఒక్కటి" అని బలవంతంగా ప్లేటందించింది కల్యాణి.

చెప్పొద్దూ, ఆయనంటే మా కల్యాణికి ఆరాధనా భావం. ఆయన మాట్లాడుతుంటే ఆపేక్షగా, ఆనందంగా వింటుంటుంది. నాకు మాత్రం ఆయనంటే జాలీ, విసుగూను.

"ఏమిటో కల్యాణీ. ఇలాంటి మనుష్యులు ఎట్లా బతుకుతారో గదా" అన్నాను ఒకసారి.

"మీరేం దిగులుపడమాకండి. వాండ్లు చాలా బాగా బతుకుతారు. అసలు వాండ్లదే నిజమైన బతుకు" అంది. ఆయన వెర్రి మా ఆవిడకూ అంటుకుంటుందేమోనని అప్పుడప్పుడూ భయం వేస్తుంటుంది నాకు.

"వస్తానోయ్ మూర్తీ, ఆశ్రమం దాకా పోయిరావాలె" అన్నాడు పరమేశ్వర్రావు టిఫిన్ ముగించి.

"సరేనండీ" అన్నాను నేను.

"ఆశ్రమమేంది, బాబాయ్" అనుమానంగా అడిగింది కల్యాణి.

"వృద్ధాశ్రమంలోని ముసలి వాండ్లను చూట్టానికి వారం వారం ఓ డాక్టరు వస్తాడు. వాండ్లకు బి.పి, షుగరు లాంటివి పరీక్షచేసి మామూలు వృద్ధాప్యపు జబ్బులకు మందులు రాసిస్తాడు. నేనూ, మా ఫ్రెండ్స్ ఇంకా ఇద్దరం వున్నాములే... మేం పోయి, బి.పి మాత్రలూ, మోకాళ్ళ నెప్పుల మర్దన తైలాలూ, ఆయింట్మెంట్లూ, బాండెయిడ్సూ లాంటివి కొని ఆ ముసలి వాండ్లకిచ్చి వస్తుంటాం. అందుకూ" అన్నాడు ఆయన బయలుదేరుతూ.

అదీ సంగతి. పిచ్చి కుదిరింది... రోకలి తలకు చుట్టమన్నాడని. ఈయన గారికేమయినా వేలువేలు వస్తున్నాయా... పెన్షనే కదా. ఓ నాల్రూపాయలు మిగిల్తే ఇట్లా ఏట్లో పోసుకోవడం తప్ప, మన మళ్ళకో, మనమరాళ్ళకో, కూతురికో ఓ నగ చేయించొచ్చుగదా. ఏమిటో ఎవరి పిచ్చి వాండ్లకు ఆనందం.

❖ ❖ ❖

చాలారోజుల కిందట ఏదో చాలా టెన్షన్ టెన్షన్‌గా మా ఇంటికి వచ్చాడు పరమేశ్వర్రావు. అప్పుడప్పుడూ ఏం, రెండు మూడ్రోజులకోసారి వస్తూనే వుంటాడు. ఆయన వస్తే చాలు మా ఆవిడకు చాలా ఆనందం. కాఫీ, టిఫినూ ఎవర్ రెడీ.

"ఏంది బాబాయ్, టెన్షనుగా వున్నావు" అడిగింది కల్యాణి.

"ఏంలేదు లేమ్మా" అని దాటవేశాడు అప్పుడు. బహుశా చెప్పడం ఇష్టం లేదేమోలే, ఏదో వ్యక్తిగత బాధ అయివుండవచ్చు అనుకున్నాము.

"ఆ పిల్లకు అట్లా అయింది. ఈమెకు ఏమౌతుందో" అని గొణుక్కుంటుంటే విన్నా.

"ఎవరి సంగతి సార్, మీరు దిగులుపడేది" అని అడిగాను కూడా.

"ఏం లేదులే" అన్నాడు. మరీ వ్యక్తిగత సంగతుల్లోకి పోయి ఆయన్ను రొక్కించడం ఎందుకులే అని ఊరుకున్నాను. ఇది జరిగిన కొన్నిరోజులకు మంచి ఉషారుగా వచ్చాడు ఒక రోజు.

"రా బాబాయ్, రా" అంది కల్యాణి. ఏదో శుభ వార్త చెప్పేట్లున్నారే. పెద్ద కోడలు ప్రసవించిందా ఏమిటి" అని అడిగింది.

"కాదమ్మా, దానికి ఇంకా ఓ నెల టైముందిలే" అన్నాడు.

"మరి ఈ సంతోషం దేనికండీ" అన్నాను.

"సునీత క్షేమంగా వచ్చిం దోయ్" అన్నాడు ఎంతో రిలీఫ్‌గా.

"ఎవరా సునీత, ఏమా

## అక్షర సంపద

అరచేతిలో స్వర్గం
అర నిమిషంలో విజయం
అదిగో పులి
ఇదిగో తోక
ఆలూలేదు చూలూ లేదు
కొడుకు పేరు సోమలింగం
నాయకుల వరాల వర్షంలో
ప్రజలు తడిసిపోతున్నారు
ఉచితాల వాగ్దానాలలో
ఉక్కిరి బిక్కిరయిపోతున్నారు
కనుచూపుమేరలో వుంది
తెలంగాణా
పొలిమేరలోనే వుంది
రాయలసీమ
ఆ రెండూ ఏర్పడితే
ఆటోమేటిగ్గా ఆంధ్ర
ఏడుకొండల వెంకన్న
ఇంద్రకీలాద్రి దుర్గమ్మ
యాదగిరి నృసింహస్వామి
తమనీ పంచుకుంటారని
కంట నీరు పెడతారు
అయితే
నన్నయ
పోతన
పెద్దన
అభిషేకించిన
ఆంధ్ర సరస్వతిలోని
యాభయి ఆరు అక్షరాలు
కలిసి మెలసే వుంటాయి!

—తాజీప్రసాద్

## ముఖం చూపని కవిత

మల్లెనో
గులాబీనో
మందారాన్నో
ఇవ్వు-
ప్రేయసికి నువ్విచ్చే పువ్వు!
రాయో
ఖడ్గమో
తుపాకీనో
ఇవ్వు-
మనిషికి నువ్విచ్చే ఆయుధం!
ఏ పువ్వో
ఏ ఆయుధమో
నువ్వు చెప్పనక్కరలేదు కానీ
నువ్విచ్చేది ఏంటనేది
వాళ్ళకర్థమయితేనే కదా
చేతులతో స్పర్శించేది!
చేతలలో ప్రదర్శించేది!
అలంకారాల్ని చూపించి
ఆడంబరాల్తో మెరిపించి
స్పష్టంగా ముఖం చూపించని
పెండ్లికొడుకు కాకూడదు కవిత!
బలవంతంగా
పీటల మీద కూర్చోబెట్టిన
పెండ్లి కూతురు కాకూడదు పాఠకుడు!

-డా॥ రావి రంగారావు

కథ" అని అడిగాను.

"నువ్వు పేపర్లూ,టీ.వీ చూడవా ఏమిటోయ్, సునీత ఎవరని అడుగుతావు" అన్నాడు. రోజూ పేపరు అన్ని పేజీలూ చదువుతాను. బిజినెస్ పేజి గంటైనా చదువుతాను. ప్రింటెడ్ అండ్ ఎడిటెడ్ బై అని వున్న దాకా అక్షరం పొల్లుపోకుండా చూస్తాను. టీ.వీ కూడా బాగానే చూస్తాను. నాకేమీ జ్ఞాపకం రాలేదు. అయినా ఆయన సొంత గొడవకూ, పేపర్లకూ సంబంధమేమిటో అర్థం కాలేదు.

"అదేనోయ్, సునీతా విలియమ్స్. అంతరిక్షంలో ఆర్నెల్లు గడిపి క్షేమంగా భూమ్మీదికి వచ్చిందోయ్" అన్నాడు. హమ్మయ్య. అదీ సంగతి.

"ఏంది సార్ మీరు మరీను. అంతరిక్షంలోకి సైంటిస్టులు మనుషులను పంపుతూనే వున్నారు. వాండ్లు వచ్చేవాండ్లు వొస్తున్నారు. ఏదో వ్యక్తిగతమైన వార్తలాగా కంగారుపెట్టారే" అన్నాను.

"అదేంటయ్యా.అలా అంటావు. ఆకాశంలో ఆర్నెల్లు గడిపి ఆ రోదసీ నౌకలో అంతెత్తునించి క్షేమంగా వచ్చిందంటే రిలీఫు కాదా. కల్పనా చావ్లాకు ఏమయిందో గుర్తులేదా" అన్నాడు.

ఓహో, అదన్నమాట. 'ఆ పిల్లకు అట్లా అయింది ఈమెకేమౌతుందో'నని ఈయన బాధపడింది సునీతా విలియమ్స్ కోసం అన్నమాట. పిచ్చి కొంచెం కొంచెం ముదురుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఏ దేశం వాళ్ళో అంతరిక్షంలోకి ఎవర్నో పంపారట. ఆమె క్షేమంగా వచ్చిందట. ఈ సంగతి స్వంత మనుషుల సంగతిగా ఫీలైపోయి విషాదమూ, ఆనందమూ పొందుతున్నాడీయన.

"ఎక్కడో ఏదో జరిగిందని పేపర్లో చూసి మీరు మరీ ఇదయిపోవడమేంది సార్" అన్నాను విసుగ్గా.

"ఏమయ్యా మూర్తీ... ఏం మాట్లాడుతావు నీవు. ఏ తల్లిదండ్రులు కన్న బిడ్డలో గదా వాండ్లిద్దరూ. ఏ బంగారు కడుపులో జన్మించారో కదా. బాగా చదువుకొని ఏ ఆఫీసరుగానో సుఖజీవితం గడుపుకోవచ్చు గదా. అలా కాకుండా ఎంత సాహసం చేశారు వాండ్లు. దేనికోసం చేశారయ్యా. ప్రపంచం కోసం చేశారు. మానవ జాతి కోసం చేశారు. అలాంటి బంగారు తల్లులకు జన్మనిచ్చిన దేశం గర్వించకుండా ఎలా ఉండ గలదు. వాండ్ల క్షేమానికి బాధపడకుండా వుండే వాడు మనిషేనా. ఇంకా కల్పన చనిపోయాక కూడా, భయ పడకుండా, ఆపదకు వెరవకుండా సునీత ఎంత ధైర్యం చేసిందో కదా.ఆ అమ్మాయి క్షేమంగా భూమ్మీ దికి దిగిందాకా నాకు భయం భయంగానే వుంద నుకో. పైగా, వాతావరణం సరిలేక ఆమె దిగడం రెండ్రోజులు వాయిదా పడింది కూడా. ఆమె క్షేమంగా దిగిందని తెలిసిన తర్వాతగాని నాకు సరిగ్గా ఊపిరాడలేదనుకో" అన్నాడు. ఏమిటీ మనిషి చిత్రమైన ప్రవర్తన అనిపిం చింది నాకు.

"బాబాయ్,ఒక్క స్వీటు" అంది ప్లేట్లో రెండు మైసూరుపాకు ముక్కలు పెట్టుకొచ్చిన కల్యాణి.

"ఇప్పుడు వద్దమ్మా" అన్నాడు పరమేశ్వర్రావు.

"అదేం కుదరదు, తీసు కోవాల్సిందే" అంది.

"పోనీ, సునీత క్షేమంగా వచ్చినందుకు తీస్కోండి" అన్నాను, వెటకారం బయ టికి ధ్వనించకుండా జాగ్రత్త

పడుతూ.

"అలాగైతే సరే" అని ఓ మైసూరు పాకు అందు కున్నాడు పెద్దాయన.

అవ్వన్నీ ఒక ఎత్తయితే ఇవ్వాళ జరిగింది మరో విచిత్రం. సాయంకాలం ఆరున్నర దాటింది. అప్పుడే ఆఫీసు నుంచి వచ్చాను. మా పిల్లలు గూడా కాన్వెంటు స్కూళ్ళ నించి ఇంటికి వచ్చారు. టీ.వీలో సి.ఎన్.బి.సిలో షేర్ల ముచ్చట తిలకిస్తూ, కాఫీ తాగుతున్నాను. "ఆఫీసు నుంచి వచ్చా వటోయ్, మూర్తీ"అంటూ వచ్చి సోఫామీద ఆశీనుడైనాడు.

"అసలు పాదాభి వందనం చెయ్యాలయ్యా వాండ్లకు. దేముళ్ళంటే వాళ్ళేనయ్యా" అన్నాడు.

"ఎవరి సంగతండీ మీరు చెప్పేది" అని అడిగాను.

"ఒకరూ ఇద్దరూ కాదు, ముప్పై ఆరుమంది" అన్నాడు. నాకు విసుగు మొదలౌతున్నది ఆయన సస్పెన్సును పేర్చుకుంటూ పోవడం చూసి.

"ఇంతకూ విషయమేం దండీ" అన్నాను.

"గంటా 2 గంటలూ కాదు మూర్తీ. ఇరవయ్యేడు గంటలు నాన్‌స్టాపుగా చేశారయ్యా. వాండ్లయ్యా దేవుళ్ళు. భగవంతుడికి రూపముండదు తెలుసా. అవసరమయినపుడు అలాంటి వాండ్ల రూపం లోనే అవతరిస్తుంటాడు" అన్నాడు.

"సస్పెన్సుతో చంపు తున్నారు. వాండ్లెవరో, ఏం చేశారో చెపుతారా ఇక నైనా" అన్నాను.

"లక్ష్మి సంగతోయ్ నేను చెప్పేది" అన్నాడాయన.

"36 మంది అని ఓ పక్క అంటున్నారు... లక్ష్మి సంగతని అంటారు. ఇంతకూ అసలు సంగతి చెప్పండీ" అన్నా.

"అదేనోయ్... లక్ష్మి. మూడేండ్ల పిల్ల. పేపర్లు చూట్టం లేదా నువ్వు నాలుగు కాళ్ళతో పుట్టింది. ఆస్పత్రులన్నీ దాన్ని సరి చేయడం మాకు సాధ్యం కాదన్నాయి. తల్లిదండ్రులా ఉన్నవాండ్లు కాదు. ఖర్చుతో కూడిన వ్యవ హారం. అప్పుడు బొంబాయి నుంచి వచ్చిన డాక్టర్లూ, బెంగుళూరి డాక్టర్లూ... మొత్తం ముప్పై ఆరుమంది ఆపరేషన్ చేశారయ్యా. గంటా రెండు గంటలూ కాదు... ఇరవై ఆరుగంటలు ఏకబిగిన. మొత్తా నికి సాధించారయ్యా. ఆ పసిదానికి ప్రాణం పోసి పునర్జన్మనిచ్చారు. సాధారణ జీవితాన్ని అను గ్రహించారు. ఒక మిరకిల్ అనుకో. ఒక మార్వెల్ అనుకో. ఆ డాక్టర్ల కాళ్ళకు ఒకసారి మొక్కిరావాలని వుందయ్యా" అన్నాడు.

## ఫూలింగ్ పారడైజ్!

**నేటి జీవితం!**
ఉడికీ వుడకని మెతుకులు
ఆదరా బాదరాగా
నోట్లోకి కుక్కుకోవడం
నేటి జీవితం!

**నేటి తరం!**
వచ్చీరాని భాషల
ఛానెల్ చేజింగ్‌తో
స్కిప్‌కాని స్కిన్ కోడ్

**నేటి వ్యాపారం**
విరిసీ విరియని
లేలేత వయస్సులను
అంగట్లో అమ్ముకోవడం

**నేటి జీతం**
చాలీ చాలని డబ్బుకు
లెక్కలు వెతుక్కుంటూ
షాపింగ్ చేసుకోవడం

**నేటి రాజకీయం**
తెలిసీ తెలియని
హింసా ధోరణుల మీద
కమిషన్లు వెయ్యడం

**నేటి నినాదం**
కనీ కనిపించని
బంగరు భవిష్యత్తును
వేర్పాటుతో సాధిద్దాం.

## చెట్టుతల్లి!

చెట్టును కోస్తుంటే
గుండెను కోసినట్లుందా
ఏం కోస్తున్నారండీ కవిగారూ!
మీ ఇంట్లో డబుల్ కాట్
చెట్టును కోసిందే కదా!!

## వాగ్దానం

దానాల్లో
వాగ్దానం గొప్పది
దాన్ని 'నెర'వేర్చు
'ఎర' వెయ్యక!

-గుడిమెట్ల గోపాలకృష్ణ

నిజమే. పేపర్లో చదువు తూనే వున్నాను. టీ.వీలో చూస్తూనే వున్నాను. కానీ ఈ పెద్ద మనిషి ఇలాంటి వన్నీ తన సొంత బాధల్లా ఫీలవుతాడేంటి. ఎవరో ఎక్కడో బాధపడితే ఇక్కడ ఈయన కన్నీరుపెట్టుకుంటాడు. లోకంలో జరిగే ప్రతి బాధకూ స్పందిస్తాడు. ప్రతి విషయానికీ ఇదైపోతాడు.లోకంలో అందరూ పట్టించుకునే విషయాలు మాత్రం అసలే పట్టించుకోడు.రాజకీయాల గురించీ,నాయకుల గురించీ మాట్లాడబోతే వాంతి వచ్చినట్లు మొహం పెడతాడు. సినిమాల సంగతి చెప్పబోతే మొహం తిప్పుకుంటాడు. క్రికెట్టు గురించి చెప్పబోతే అక్కణ్ణించి లేచిపోతాడు. లోకంలో నలుగురికీ కావాల్సిన విషయాలు ఈయనకు అక్కర్లేదు. ఊరందరిదీ ఒక దారైతే ఉలిపికట్టెది ఇంకో దారి.

## బొబ్బిలి నానీలు

నదీ ప్రవాహంలో
బంగారు తీగెలు
ఉషోదయ
రవి కిరణాలు!

పరిమళం లేదని
పరిహసించకు
మన వేషానికి భాష్యం
ప్రత్తే మరి!

కుమిలి రోదించకు
కొలిమిలా రగులు
మనిషిగా మనీషిగా
మిగులు!

నాయకుడ్ని చూచి
గాలి
గడగడలాడుతోంది
తనని మింగేస్తాడని!

చట్ట సభల్లో
రభస లేని అంశం
వారి వేతనం
పెంచుకోవటం!

-బొబ్బిలి జోసెఫ్

## మళ్లీ కొత్తగా

నినాదాలు శిరసెత్తుతాయి
పాటలు ప్రవహిస్తుంటాయి
పథకం మాత్రం సిద్ధం కాదు
కళ్లు పొగలు కక్కుతుంటాయి
కాళ్లు కవాతు చేస్తుంటాయి
డొక్కలు పిక్కటిల్లుతుంటాయి
మంటలు మాత్రం అంటుకోవు

వ్యూహాలు పదునెక్కుతాయి
బలగాలు బరిలోకి దిగుతాయి
శంఖారావాలు ప్రతిధ్వనిస్తాయి
యుద్ధం మాత్రం మొదలు కాదు

మరమ్మతులు మొదలయ్యాయి
గాయాలకు కుట్లు వేస్తున్నారు
రక్తపు నమూనాలు సేకరిస్తున్నారు
నినాదాల్ని నిజనిర్ధారణ చేస్తున్నారు
మళ్లీ కొత్తగా స్వరం పురి విప్పుతోంది

-ఎమ్వీ రామిరెడ్డి

"ఆపరేషన్ ఇబ్బందులు తగ్గి, లక్ష్మి పూర్తి ఆరోగ్యవంతురాలైందని పేపర్లో వచ్చేదాకా మాత్రం నాకు భయం భయంగానే వుందయ్యా" అన్నాడు.

"ఏం ఫర్వాలేదులే బాబాయ్. నీనోటిచలవన ఆ పిల్ల సుఖంగా,ఆరోగ్యంగా నూరేళ్ళూ బతుకుతుంది. ఇవిగో ఈ దానిమ్మ గింజలూ, యాపిల్ ముక్కలూ తీసుకోండి" అని ప్లేటు ఆయన ముందు పెట్టింది. ఆయన దమ్మిడీకి కొరగాని ఇలాంటి కబుర్లు చెప్పడం, మా ఆవిడ తెగ ముచ్చటపడిపోవడం... ఇదే మొదటి సారి కాదు.

❖ ❖ ❖

ఆరోజు రాత్రి భోంచేసి పడుకున్న తరువాత గునుస్తూ, గునుస్తూ అంది మా ఆవిడ "ఇవ్వాళో పని చేశానండీ. మీరు కోప్పడనంటే చెపుతాను" అని.

తెలుసు, తెలుసు. ఏదో చేసేవుంటుంది. ముందుగానే మీరు కోప్పడరుగా అంటే ముందు కాళ్ళకు బంధం వేయడమేగదా. పట్టుచీరో, బంగారు గొలుసో

నాకు చెప్పకుండా కొని వుంటుంది. ఆడవాం డ్లకు చీరలూ, నగలూ తప్ప వేరే విషయాలు ఏముంటాయి.

"చెప్పు, చెప్పు. పట్టు చీరా,నెక్లెసా?ఆడవాండ్లకు ఇంకేముంటాయి" అన్నాను.

సర్రున కోపమొచ్చింది కల్యాణికి. "నాకేం అలాంటి వ్యామోహాలు లేవు. మీరే ఇండ్ల సైట్లనీ, షేర్లనీ ఇరవై నాలుగ్గంటలూ డబ్బు, డబ్బు అని కలవరించేది" అంది.

"సరేలే, ఇంతకూ సంగతేంది" అన్నాను బుజ్జగిస్తూ. రాత్రిపూట బెడ్‌రూమ్‌లో భార్యను ఎక్కువసేపు కోపంలో వుంచడం అంటే చాలా సాధక బాధకాలుంటాయి గదా.

"ఏంలేదు. పొద్దున పరమేశ్వర్రావు బాబాయి వచ్చినప్పుడు మీరున్నారు గదా" అంది.

"అవును. అయితే?"

పొద్దున్నే నేను ఆఫీసుకు పోయే ముందు ఆయన వచ్చాడు. "మూర్తీ, ఓ చిన్న హెల్ప్ చేసిపెట్టాలోయ్" అన్నాడు. "ఏమిటండీ" అన్నాను.

జేబులోంచి ఓ ఐదువేలు తీసిస్తూ, "ఈ డబ్బుతో ఓ డ్రాఫ్టు తీసి, ఇదిగో ఈ అడ్రసుకు పంపాలోయ్. మా ఆవిడకు కొంచెం సుస్తీగా వుంది. నేను ప్రస్తుతం బ్యాంకుకు పోలేను. ఏమీ అనుకోకుండా, కొంచెం ఆ పని చేసిపెట్టగలవా" అన్నాడు.

"అదెంతపనిలెండి" అంటూ డబ్బూ, అడ్రస్ కాగితమూ తీసుకున్నాను.

"ఇంతకూ ఎవరికి పంపుతున్నావు బాబాయ్" అని అడిగింది కల్యాణి కాఫీ కప్పుతో వచ్చి ఆయనకు అందిస్తూ.

"ఏంలేదమ్మా. గుండెజబ్బులున్న పసిపిల్లలకు ఆపరేషన్లకు చాలా ఖర్చవుతుంది గదమ్మా. ప్రత్యేకంగా అలాంటి జబ్బులున్న పసివాండ్లకు వైద్యం కోసం హైదరాబాదులో ఓ స్వచ్ఛంద సంస్థ నిధిని పోగుచేస్తున్నది. దానికి నా చందా ఈ చిన్న మొత్తం పంపుతున్నా. మరీ దౌర్భాగ్యం కాకపోతే, పసిపిల్లలకు గుండెజబ్బులేమిటమ్మా, తలచుకుంటేనే బాధగా వుంది" అన్నాడు.

"నేను బ్యాంకుకు పోవాలనుకుంటున్నాను. ఆ డబ్బు ఇలా ఇవ్వండి, నేను పంపుతాను" అని నా దగ్గర్నించి అవి తీసుకుంది కల్యాణి. ఆ సంగతే ఇప్పుడు గుర్తు చేసింది.

" డబ్బులు డ్రాఫ్టు తీసి పంపావా" అని అడిగాను.

"పంపానండీ" అని చెప్పింది.

"మరింక ప్రాబ్లమేంటి" అని అడిగాను.

"ఏం లేదండీ. ఆ ఐదువేలతోపాటు మన డబ్బులు ఓ ఐదువేలు గూడా ఆ సంస్థ వాండ్లకు మీ విరాళంగా పంపాను" అంది కల్యాణి.

అయిపోయింది. ఈ పరమేశ్వర్రావు ఇప్పటిదాకా మా డ్రాయింగ్ రూమ్‌దాకానే వచ్చాడు. కాఫీలూ,టిఫిన్ల వరకే పరిమితమయ్యాడు. ఇప్పుడు మా బెడ్‌రూమ్‌లోకీ, బడ్జెట్‌లోకీ ప్రవేశించాడు. ఏం చెయ్యాలో కదా! ■

## నాయినమ్మ నులక మంచం

**మా** అనురాగపు లోగిలిలోంచి...
అందని తీరాలలోకి శాశ్వతంగా
దూరంగా వెళ్లిపోయిన మా నాయినమ్మ
నాకు మిగిల్చిన అపురూపమైన వస్తువు
ఆమె నులక మంచం.
చదువుకు వెళ్లి అలసిన నేను
మంచంలో కూర్చొని సేదతీరుతుంటే
నాయినమ్మ ఒళ్ళో కూర్చోబెట్టుకొని
తన పైటకొంగుతో
చెమట తుడుస్తున్నట్టు ఉంటుంది
మంచంపై చదివే సమయంలో
అక్షరం ముక్క రాని నాయినమ్మ కూడా
అక్షరాలు దిద్దబెట్టుతున్నట్టు ఉంటుంది
విద్యాబుద్ధులు నేర్పిన భావనేమో!
రాత్రిపూట మంచంలో పడుకున్నప్పుడు
తన చల్లని ఒడిలో పడుకున్నట్లు
ఎన్నో కథలు, మరెన్నో శాస్త్రాలు చెప్పి
నిద్రపుచ్చిన నాయినమ్మ గొంతుక
జోలపాట పాడుతున్నట్టు ఉంటుంది
మంచంకేసి చూసిన ప్రతీసారి
మంచంలో నాయినమ్మ
చుట్టతాగుతున్నట్టు ఉంటుంది
'ఒరేయ్ మళ్లీ నిప్పు తీసుకురా నాయనా...'
అనే మధురమైన మాటలు వినిపిస్తాయి
తీరా దగ్గరికి వెళ్లేసరికి
మంచం మాత్రమే మిగిలి ఉంటుంది
కన్నీళ్లతో మంచంలో పడిపోతాను.

**-భారతీయుడు**